ప్రజాశక్తి
బుధవారం 22 మార్చి 2023
5
విజయనగరం



వడ్డీ మాఫీని ఉపయోగించుకోండి

ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై విధించిన వడ్డీని ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసిన నేపథ్యంలో ప్రతిఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో వడ్డీ మాఫీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్‌ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కాపుగంటి ప్రకాశ్, రవ్వా శ్రీనివాస్ తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడారు. పన్ను బకాయిలపై పడ్డ వడ్డీ భారాన్ని ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ఈ నెలాఖరులోపు ఏక మొత్తంలో పన్నులను చెల్లిస్తే వడ్డీ మాఫీ పొందే అవకాశం ఉంటుందన్నారు.

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎక్కడికక్కడ మొక్కజొన్న పంట నేలకొరిగింది. పడిపోయిన చోట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశముంది. పంట చేతికొచ్చే దశలో అకాలవర్షాలు ముంచెత్తడంతో రైతులు కుదేలయ్యారు. పంటంతా నేలమట్టం అవడంతో మొక్కజొన్న రైతులు కన్నీరు పెడుతున్నారు.



వంగరలో నేలకొరిగిన మొక్కజొన్న

వెన్ను విరిచిన వాన

అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులకు అపార నష్టం

ప్రజాశక్తి-నెల్లిమర్ల, వంగర, గుర్ల

జిల్లాలో వంగర, సంతకవిటి, రాజాం, చీపురుపల్లి, గరివిడి, జామి, గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ తదితర మండలాల్లో రబీలో మొక్కజొన్న ఎక్కువగా సాగవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక చోట్ల మొక్కజొన్న పంట నేలమట్టమైంది. సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. నెల్లిమర్ల మండలంలో 3230 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా సుమారు 100 ఎకరాల్లో కంకి దశలో పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సతివాడ, బూరాడపేట, పారసాం గ్రామాల్లో అకాల వర్షాలకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. వంగర మండలంలో తలగాం, శివ్వాం, వంగర, కొండచాకరాపల్లి, సంగాం, నీలయ్యవలస, కింజంగి తదితర గ్రామాల్లో రైతులు సుమారు 2 వేల వరకు మొక్కజొన్న పంట వేశారు. ఇటీవల వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో మొక్కజొన్న, అరటి పంటలు భారీనష్టం వాటిల్లింది. మండల వ్యవసాయ అధికారి జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో పర్యటించి 375 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాలలో అరటి పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. గుర్ల మండలంలో పల్లిగండ్రేడు, పాలవలస, పకీరుకిత్తలి, కొండగండ్రేడు, తెట్టంగి తదితర గ్రామాల్లో 2250 ఎకరాల్లో మొక్కజొన్న విస్తారంగా సాగుచేస్తున్నారు. సోమవారం సాయంత్రం వర్షంతోపాటు విపరీతంగా గాలులు వీయడంతో మొక్కజొన్న పంట మొత్తం నేలకొరిగింది. పంట మరో 20 రోజుల్లో చేతికొస్తుందన్న తరుణంలో నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 650 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ఎఒ తిరుపతిరావు చెబుతున్నారు.



గుర్ల.. దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

విజయనగరంటౌన్ : జిల్లాలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్‌కి మంగళవారం లేఖరాశారు. పంట నష్టాన్ని అంచనా వేసి, వెంటనే రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.



నెల్లిమర్ల.. నేలకొరిగిన మొక్క జొన్నను నిలబెడుతున్న రైతు

పంట నష్టాన్ని అంచనా వేయండి

అధికారులకు జెసి ఆదేశం



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్

శృంగవరపుకోట : ఇటీవల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్.కోట మండలంలో జెసి పర్యటించారు. సీతానగరం గ్రామంలో జరిగిన అరటిపంట నష్టాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అరటితోటకు వెదురుతో స్టేకింగ్ చేయాలని, దీనివల్ల ఈదురుగాలులకు నష్టం జరగకుండా ఉంటుందని జెసి తెలిపారు. సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని, రైతులకు న్యాయం చేస్తానని జెసి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా ఉద్యానశాఖాధికారి జమదగ్ని, ఎడి శైలజ పాల్గొన్నారు. అనంతరం ధర్మవరంలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను జెసి అశోక్ పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ కీర్తన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు

కనీస వేతనాల కోసం..

ఆశాల ధర్నా

పిఎఫ్, గ్రాడ్యుటీ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశావర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి ఆశావర్కర్లు పెద్దఎత్తున తరలివచ్చారు. కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పని భారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, వెయ్యి జనాభాకు ఒక ఆశాను నియమించాలని నినాదాలు చేశారు.

ధర్నాను ఉద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా, పనిభారం పెంచి వెట్టి చాకిరి చేయించుకుంటోందని ధ్వజమెత్తారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. బడ్జెట్ కేటాయింపులు పెంచకుండా తగ్గించడం దారుణమన్నారు. దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిఎంహెచ్‌ఒ రమణకుమారికి వినతి పత్రం అందించారు. తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని ఆమె హామీనిచ్చారు. మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా నాయకులు టివి రమణ, ఆశా వర్కర్లు యూనియన్ నాయకులు గౌరి, మహాలక్ష్మి, అప్పలనారాయణ, వరలక్ష్మి, చంద్రకళ, శశికళ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలుకే

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

బాల్య వివాహాలను ఎక్కడా జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారిని జైలుకే పంపాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మండల ప్రత్యేకాధికారులు , మెడికల్ అధికారులు, సిడిపిఒలతో సఖి, సహేలి బృందాల పని తీరు, బాల్య వివాహాల నిరోధం, డ్రాప్ అవుట్ల గుర్తింపు, టీనేజ్ ప్రెగ్నెన్సీ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 71 టీనేజ్ ప్రెగ్నెంట్స్ ఉన్నారని, దీనిని బట్టి బాల్య వివాహాలు ఎక్కువగానే జరుగుతున్నాయని తెలుస్తోందని చెప్పారు. ఇటీవల బాల్య వివాహాలు ఎందుకు జరిగాయి, వెనుకనున్న కారణాలు ఏమిటని మండల బృందాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల అనారోగ్య, ఆర్థిక పరిస్థితులు, ప్రేమ వ్యవహారాలు కారణాలుగా వైద్యాధికారులు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ తప్పనిసరిగా వివాహం జరిగిన పరిస్థితిలో ఆ బాలికను భర్త నుంచి వేరేగా ఉంచి చదువు కొనసాగించేలా చూడాలన్నారు. గ్రామాల్లో సర్పంచులను సమావేశాలకు పిలవాలని, బాల్య వివాహాల వల్ల నష్టాలను వివరించాలని తెలిపారు.

టెన్త్, ఇంటర్ చదువు తర్వాత పెద్ద చదువులు చదవలేని వారికి, జీవితంలో వేగంగా సెటిల్ అవ్వాలని కోరుకునే వారికి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగించాలని తెలిపారు. అనంతరం జిల్లాలో భూ గర్భ జలవనరుల నిలువలు- యాజమాన్య ఆవశ్యకత అనే పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రమణకుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాద్, మెప్మా పీడీ సుధాకర్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఉగాది శుభాకాంక్షలు

ఈ ఏడాది అంతా జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకాంక్షించారు. శోభకృత్ నామ ఉగాది సందర్భంగా ఆమె జిల్లా ప్రజలకు ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది కూడా ప్రకృతి అనుకూలించి, పంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలు సిద్ధించాలని, జిల్లా అభివృద్ధి పథాన పయనించాలని కోరారు. రెట్టించిన ఉత్తేజంతో, సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రుచిగా... శుచిగా... జగనన్న గోరుముద్ద

పిల్లల మధ్యాహ్న భోజన మెనూలో చేరిన రాగిజావ ● రామభద్రపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-రామభద్రపురం

జగనన్న గోరుముద్ద పేరుతో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇప్పటికే అందిస్తోన్న 15 రకాల వంటకాల జాబితాలో కొత్తగా రాగిజావ చేరింది. వారంలో మూడు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాగిజావ అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దానిలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి ప్రారంభించారు. జగనన్న గోరుముద్ద తాలూకా ఉద్దేశాలను వివరించారు. ఈ క్రమంలో రాగిజావ పంపిణీని జిల్లాలోని రామభద్రపురం పాఠశాల నుంచి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుతో కలిసి కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రారంభించారు. జీడిపప్పు, బెల్లం కలిపి తయారు చేసిన రాగిజావను గ్లాసుల ద్వారా విద్యార్థులకు అందజేశారు. ముందుగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పథకం ఉద్దేశాలను వివరించారు. రామభద్రపురంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి వర్చువల్ విధానంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని హైమావతి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, మౌలిక వసతులు, నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మెరుగుపడుతున్న సదుపాయాలను వివరించారు.



రాగిజావ తీసుకుంటున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పోషక విలువలతో కూడిన ఖరీదైన ఆహారం

కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాగిజావ ఒకప్పటి సంప్రదాయక ఆహారమని.. ఇప్పుడు సంపన్నుల ఇళ్లల్లో ఖరీదైన ఆహారంగా కూడా తీసుకుంటున్నారని తెలిపారు. దీని విలువను గుర్తించిన ప్రభుత్వం పిల్లలకు అందించేందుకు సంకల్పించిందని తెలిపారు. పిల్లల ఆరోగ్యమే ప్రధానమని ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

జిల్లాలో 1.41 లక్షల మందికి రాగిజావ

జిల్లాలోని 1,751 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో చదువుకుంటున్న 1,41,410 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు రోజుల పాటు రాగిజావ అందించనున్నామని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సిఎంతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పథకం అమలుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పాఠశాల ప్రార్థన అయిన వెంటనే ఉదయం 8.45 గంటలకు విద్యార్థులకు రాగిజావ అందించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ డిఇఒలు తిరుపతినాయుడు, వాసుదేవరావు, ఎంపిపి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సరస్వతమ్మ, ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఎంపిడిఒ రమామణి, హెచ్‌ఎం కామేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

6 నుంచి అభివృద్ధి పనుల వారోత్సవాలు

డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వచ్చే నెల ఆరో తేదీ నుండి వివిధ అభివృద్ధి పనుల ప్రారంభ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. ఈ మేరకు పనుల ప్రగతిపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు ఎన్ని, ప్రారంభ దశలో ఉన్నవి ఎన్ని, శంకుస్థాపనలు చేపట్టాల్సిన పనుల విధివిధానాలు వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 6న స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతంలో దండి మార్చ్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించి, వారోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతుల ఆధారంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో గత మూడు వేసవి కాలాల్లో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలతో జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఈసారి కూడా ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తలు చేపట్టామన్నారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతిదేవి, కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ శుభాలు కలగాలి

శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభిలషించారు. ఉగాదిని పురస్కరించుకుని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, పార్టీ శ్రేణులకు ఉగాది శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. తెలుగువారి మొదటి పండుగ ఉగాది అని, తీపి చేదుల కలయికలా, షడ్రుచుల సమ్మేళనంలా ప్రతిఒక్కరి జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.

చీటింగ్ కేసుల్లో ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు

ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

చీటింగ్ కేసుల్లో ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు పూర్తిచేయాలని ఎస్‌పి ఎం.దీపికా పాటిల్.. పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సివిల్ తగాదాలపై వచ్చిన ఫిర్యాదుల్లో డాక్యుమెంట్లు పరిశీలించి, రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు న్యాయస్థానాల నుండి వచ్చిన తక్షణమే ఎగ్జిక్యూట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని, కేసులు నమోదు చేయాలని సూచించారు. సైబరు నేరాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రతిభకు ప్రశంసలు

జిల్లా పోలీసుశాఖలో విధులను సమర్థవంతంగా నిర్వహించి, దొంగతనం కేసులను ఛేదించిన అధికారులను, సిబ్బందిని ఎస్‌పి అభినందించి, జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. జామి, ఎస్.కోట, ఎల్.కోట, డెంకాడ, విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన ఆరు ట్రాక్టర్ల దొంగతనం కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి, చోరీ అయిన ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబర్చిన జామి ఎస్ఐ జి.వీరబాబును బెస్ ఫెర్మార్‌గా ఎంపిక చేసి, అభినందించారు.

ఈ సమావేశంలో ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, బి.మోహనరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎల్.మోహనరావు, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డిపిఒ ఎఒ వెంకట రమణ, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోడీతో జిల్లా విద్యార్థులు

విద్యార్థుల విద్యా పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

విద్యా పర్యటనకు వెళ్లిన జిల్లా విద్యార్థులు ప్రధాని మోడీని మర్యాద పూర్వకంగా కలిశారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో 8, 9వ తరగతులు చదువుతున్న 15 మంది విద్యార్థులను విద్యా పర్యటనకు బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ నెల 16 నుంచి తీసుకెళ్లారు. అందులో భాగంగా ఢిల్లీలో పార్లమెంట్, నాణేల తయారీ కేంద్రం, ఇండియా గేట్‌ను సందర్శించారు. ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల సంరక్షణ నిమిత్తం వార్డెన్లు భాస్కరరావు, గౌరిలక్ష్మి, ఆఫీస్ పర్యవేక్షకులు కె.ఆదినారాయణ కూడా పర్యటనకు వెళ్లారు.

భూకబ్జాలు ఆపాలని ఆందోళన

ప్రజాశక్తి-విజయనగరం కోట

దుప్పాడ గ్రామంలో భూకబ్జాలు ఆపాలని టిడిపి, జనసేన ఆధ్వర్యాన మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, గంటా పోలినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను వైసిపి నాయకులు రికార్డులు మార్చి కాజేస్తున్నారని ఆరోపించారు. తమ కార్యకర్తలను బినామీగా చేసుకుంటున్నారని తెలిపారు. రోజురోజుకూ భూదందాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

నూకలమ్మను దర్శించుకున్న డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని మంగళవీధి నూకాలమ్మ ఆలయాన్ని మంగళవారం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ సందర్శించారు. ఆలయ నిర్వాహకులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం వీరు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎడ్ల రాజేష్, కార్పొరేటర్ బాలి పైడిరాజు, వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్, అచ్చిరెడ్డి, ఫణి రాజశేఖర్, పప్పు ప్రసాద్, సతీష్ రెడ్డి, చలపతిరావు పాల్గొన్నారు.

'సీతం'లో హైడ్రాలజి ప్రాజెక్టుపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, భూగర్భ జలాల శాఖ ద్వారా జలదినోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని భూగర్భ జలశాఖ డిడి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. జలవనరుల, జల సరఫరా వనరుల పునరుద్ధరణ, జలం ప్రాముఖ్యతను వక్తలు వివరించారు. వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు మాట్లాడుతూ చిరు ధాన్యాలు ఆరోగ్యపరంగా అత్యుత్తమైనవేకాక, అతి తక్కువ నీటితో పండించవచ్చని సోదాహరణంగా వివరించారు. తోటపల్లిలో ఇంజనీరు రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాజెక్టుల గురించి, ఆయా ప్రాజెక్టుల వల్ల నీటి సరఫరా పొందుతున్న పంటల వివరాల గురించి వివరించారు. సూక్ష్మ నీటిపారుదలశాఖ పీడీ లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ వినూత్న నీటి పారుదల పథకాల ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ కొద్ది సంవత్సరాల్లో గ్రామాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. పశుసంవర్ధక శాఖ జెడి వైవి రమణ మాట్లాడుతూ నీటి వనరుల ప్రాముఖ్యతను వెల్లడించారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ సమిష్టికృషి, చిన్న చిన్న ప్రయత్నాలతో ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా శశిభూషణరావు అందరితో జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సీతం కళాశాల యాజమాన్య ప్రతినిధులు

అవగాహనతోనే క్షయ దూరం

నెల్లిమర్ల : అవగాహనతోనే క్షయ వ్యాధిని దూరం చేయాలని సిహెచ్‌సి డిప్యూటీ సివిల్ సర్జన్ కె. శ్రీనివాసారావు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జరజాపుపేటలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా డిసిఎస్ శ్రీనివాసారావు మాట్లాడుతూ శరీరంపై మచ్చలు ఏర్పడడం గుర్తించి వైద్యుని సంప్రదించాలని కోరారు. క్షయ వ్యాధికి భయ పడాల్సిన అవసరం లేదని మందులు, చికిత్స అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్యులు లోకేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, టిబి సూపర్ వైజర్ వీరా స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో గొంప కృష్ణ

వేపాడ : కదిరిలో నారా లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్రలో మంగళవారం టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ పాల్గొని ఆయనతో పాదయాత్ర చేశారు. ఆయనతో పాటుగా విశాఖ, అనకాపల్లి జిల్లాల టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ మంత్రి రోజా నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రకు వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆమెకు భయంపట్టుకుందన్నారు.

ఘనంగా నూకాలమ్మ తీర్థ మహోత్సం

శృంగవరపుకోట : కొత్త అమావాస్య, నూతన తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా మండలంలోని పలుచోట్ల నూకాలమ్మ తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌరీపురం వద్ద గల నూకాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుండే అమ్మవారికి పసుపు కుంకుమ చీర సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గ్రామ ప్రజల సహకారంతో మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కబడ్డీ పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నూకాలమ్మకు భక్తుల తాకిడి

వేపాడ : మండలంలో బొద్దాం, వేపాడ, ఆతవ, వావిలపాడు గ్రామాలలో నూకాలమ్మ గుళ్లకు మంగళవారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేపై దాడి దుర్మార్గం

బొబ్బిలి : అసెంబ్లీలో టిడిపి దళిత ఎమ్మెల్యేపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం అన్యాయమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అసెంబ్లీలో టిడిపి దళిత ఎమ్మెల్యేపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. అసెంబ్లీలో దాడి వైసిపి అరాచక పాలనకు నిదర్శమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా క్షేత్రంలో వైసిపి తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విశాఖ రాజధానికి వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, మేధావులు తీర్పు ఇచ్చారని బేబినాయన అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టభద్రులు, మేధావులు ఓటు వేసి టిడిపిను గెలిపించారన్నారు.

నీటి వనరులను పరిరక్షించాలి

భోగాపురం : నీటి వనరులను పరిరక్షించాలని ఎంపిడిఒ బంగారయ్య అన్నారు. మండలంలోని నందిగాంలో ప్రపంచ జల దినోత్సంలో భాగంగా ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై మానవ మనుగడకు అవసరమైన ప్రధాన అవసరాలలో నీరు ఒకటని, నీటి వనరు లేకుండా, భూమిపై మనిషికే కాదు ఏ ప్రాణికి మనుగడే ఉండదని చెప్పారు. ప్రతీ వర్షపు బొట్టుని ఒడిసి పట్టి ఇంకుడు గుంతలలో ఇంకేటట్లు చేయాలన్నారు. ఇప్పుడున్న లేటెస్టు టెక్నాలజీతో నీటిని ఏ విదంగా ఆదా చేయాలో అక్కడున్న ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, సర్పంచ్ గరే మురళి , ఎపిఎం రమణ, ఎపిఒ ఆదిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హేమంత్, పడాల భాను, పోతురండి గోపి, గరే సంజీవ్, కార్యదర్శి రమణమ్మ, ఉపాధి హామీ కూలీలు,పాల్గొన్నారు.

మిరాకిల్ కళాశాలలో టెక్ ఫెస్ట్

భోగాపురం : మండలంలోని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో వైవిడ్ అనే పేరుతో టెక్ ఫెస్ట్ మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తమ కంప్యూటర్ నైపుణ్యాలను ప్రదర్శించారు. అంతకుముందు కళాశాలలో ఫెస్ట్ సందర్భంగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడలు నిర్వహించారు. ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు యాజమాన్యం ప్రోత్సాహకాలు అందజేసింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అర్జునరావు, త్రినాధరావు, వివిధ శాఖల హెచ్ఒడిలు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

బొబ్బిలి : వైసిపి 30వ వార్డు ఇంచార్జి వాడపల్లి మనోజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ముస్లిం వీధిలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మూడు రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కానుండడంతో మున్సిపల్ కో అప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్, మనోజ్ కుమార్ నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఇంతియాజ్, గృహసారధులు అబ్దుల్ సమాజ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

రామభద్రపురం : సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న పేదలకు గొప్ప వరమని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ కుడికాలు దెబ్బతిని శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయనకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రూ.40 వేలు చెక్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పుకొండ సరస్వతి, పాల్గొన్నారు.

బొబ్బిలి : సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న పేదలకు గొప్ప వరం లాంటిదని స్థానిక ఎమ్మెల్యే శ్రీ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. నియోజకవర్గ పరిధిలో గల బాడంగి, బొబ్బిలి, రామభద్రపురం మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు గాను రూ.1.90లక్షల చెక్కులను ఆయన చేతుల మీదుగా సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఎంపిటిసి గొర్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

కొత్తవలస : ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి అందరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాది చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం పన్నాగాలు పండిందని ఆయన ఆరోపించారు. ఈ చట్టాన్ని రక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. జాబ్ కార్డు ఉన్నవారికి 200 రోజు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.600 వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి సుందరమ్మ, గంధం లక్ష్మి, వెంకటరమణ, సముద్రం పాల్గొన్నారు.

'క్యాచ్ ద రెయిన్'పై అవగాహన

గరివిడి : చీపురుపల్లి జివిఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ఆవరణలో ఆశయ యూత్ అసోషియేషన్, విజయనరగరం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'క్యాచ్ ద రెయిన్' ప్రచారంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో ఉప-నేల పొరలు సృష్టించడంతోపాటు, వర్షపు నీటిని కాపాడుకోవడం వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి రమణ, లెక్చరర్ డి. స్వామి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహారా ఖాతాదారులలో హర్షం

బొబ్బిలి : సహారా ఇండియా ఖాతదారులకు మెచ్యూరిటీ సొమ్ము చెల్లించేందుకు సుప్రీంకోర్టు అనుమతులు ఇవ్వడంతో సహారా ఇండియా ఖాతాదారులు, ఏజెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారులకు మెచ్యూరిటీ సొమ్ము చెల్లించాలని గత కొంతకాలంగా ఏజెంట్లు ఆందోళన చేస్తున్నారు. మెచ్యూరిటీ సొమ్ము చెల్లించేందుకు సహారా ఇండియా, సెబీ ఖాతా నుంచి రూ.5వేల కోట్లు చెల్లించాలని సుప్రీంకోర్టు అనుమతులు ఇవ్వడంతో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఏజెంట్లు ఆనందం వ్యక్తం చేశారు.

సింగవరంలో పొలంబడి

డెంకాడ : మండలంలోని సింగవరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి బి. రామకోటి మాట్లాడుతూ మొక్కజొన్న పంటలు రసాయనిక ఎరువులు భూసార పరీక్షలు అనుసరించి వాడుకోవాలని సూచించారు. ఈ పంటలో జీరో టిల్లేజ్ విధానంతో వేసిన పంటకు పురుగు ఉదిరితే తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిసిడబ్ల్యూ ఎఫ్‌సిఎ. పి.గురుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

జగనన్న గోరు ముద్దలో భాగంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వారానికి మూడు రోజులు రాగిజావ అందిస్తామని ఎంపిపి వెంకటవాసుదేవరావు అన్నారు. మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వారానికి మూడు రోజులు పాటు ప్రతి విద్యార్థికి రాగి జావ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి అచ్చుం నాయుడు, పాటశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణంలో మంగళవారం ఎంపిపి గేదెల శ్రీనివాసరావు చేతులు మీదుగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వారానికి 15 రకాల ఆహార పదార్థాలు, ఐదు రోజులు గుడ్డు, మూడు రోజులు చిక్కితో పాటు మరో మూడు రోజులు రాగిజావను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ, ఎంపిడిఒ కె. రూపేష్, ఎంఇఒ సిహెచ్ కూర్మారావు, మహిళా సమాఖ్య సంఘం ఎపిఎం అప్పలనాయుడు, హెచ్ఎం ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. రంగారాయపురం ప్రైమరీ పాఠశాలలో సంతపేట ఎంపిటిసి కలవలపల్లి సత్యవతి, కొట్యాడ జెడ్‌పి స్కూల్లో సర్పంచ్ కొట్యాడ దేవిమహేష్, మార్లాపల్లి ప్రైమరీ పాఠశాలలో ఎంపిటిసి వీరబాబు తదితరులు ఆయా పంచాయతీలలో విద్యార్థులకు రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భోగాపురం : మండలంలోని ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ మైలపిల్లి నరసింహులు విద్యార్థులకు రాగిజావను అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మసేను, ఎస్ఎంసి చైర్మన్ బడి నరసయ్యమ్మ, హెచ్ఎం గుడివాడ శ్రీదేవి, ఉపాధ్యాయులు పడాల చంద్రశేఖర్, లక్ష్మణరావు, ఎల్ పార్వతి దేవి, ఎం గణపతి, సిఆర్పి మాత, శేషుబాబు పాల్గొన్నారు.



కొత్తవలస: విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలసలో ప్రధానోపాధ్యాయులు జెసి రాజు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కాసిందొరవలస గ్రామ పెద్ద కె సూర్య రావు, పేరెంట్ కమిటీ ఛైర్ పర్సన్, వార్డ్ మెంబెర్స్ గోపాల్, రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్నగోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా మంగళ వారం కొండవెలగాడ, జరజాపు పేట గ్రామాల్లో ఎంపిపి, జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. కొండవెలగాడలో ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జరజాపు పేటలో నగర పంచాయతి వైస్ చైర్మన్ సముద్రపు రామా రావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి. గిరిబాల, ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సిహెచ్ రాధాకృష్ణ, కె. విక్టోరియా రాణి, జర జాపు పేట స్కూల్ కమిటి ఛైర్మన్ కాళ్ళ విజయ్ కుమార్, గ్రామ పెద్దలు నల్లి శ్రీను, పాల్గొన్నారు.



ఎల్‌కోట: విద్యార్థినులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపిపి

వేపాడ: మండలంలో మంగళవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, డిసిసి చైర్మన్ వి.వి చిన్న రామ నాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర రావు, నాయకులు బీల సతీష్, బొడ్డు శ్రీను, మండల గ్రామ సర్పంచులు సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు, ఆయా గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: జగనన్న గోరు ముద్ద మరో పౌష్టిక ఆహారంగా, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తుందని ఎస్ కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస ప్రభుత్వ హైస్కూల్లో ఎంఇఒ జి శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, జెసిఎస్ ఇంఛార్జి బొంతుల వెంకటరావు, గొరపల్లి రవి, పల్లా భీష్మ, ఆతవ రమేష్, ఎంపిడిఒ జి. అరుణ, హైస్కూల్ హెచ్ఎం బండారు శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ చిక్కాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెంటాడ: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు మంగళవారం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు చేతులు మీదుగా రాగిజావను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, మెంటాడ సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపిడిఒ త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు. మీసాల పేట ప్రభుత్వ పాఠశాల, చల్లపేటలో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో ఎంపిటిసి చప్ప సూర్య కుమారి, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్ర రావు, మీసాల పేట సర్పంచ్ మహంతి రామ నాయుడు ఆధ్వర్యంలో ఆ కార్యక్రమాన్ని చేపట్టారు.



నెల్లిమర్ల: విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న గదల



వేపాడ: విద్యార్థినులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపిపి

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం త్రినాథరావు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి రామారావు చేతులు మీదుగా మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసరావు, ఎంఇఒ కృష్ణమూర్తి, ఏఎస్ఐ కొండలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని కందిస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా అమలు చేసిన రాగి జావా, బెల్లం మెనూ తహశీల్దార్ టీ కళ్యాణ చక్రవర్తి మంగళవారం పరిశీలించారు. మెనూ నాణ్యతను స్వయంగా రుచి చూసి విద్యార్థులకు వడ్డించారు. ఆయన వెంట వైసిపి నాయకులు కెల్ల మన్మధరావు, హెచ్ ఎం జగదీశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళశారం జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, రాష్ట్ర క్షత్రియ సంఘం డైరెక్టర్ కెఎస్ఆర్‌కె ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి కోట్ల విశ్వేశ్వరరావు, బైరిపురం సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ చైర్మన్ లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: మండలంలోని పాలవలస, నడుపురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎంపిపి పొట్నూరు ప్రమీల చేతులు మీదుగా పంపిణీ చేశారు. తొలి రోజు 5900 మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసినట్లు ఎంఇఒ భాను ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, ఆయా గ్రామ సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ధృవ -2023

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఇసిఇ స్టూడెంట్ అసోసియేషన్ వార్షికోత్సవం ధవ -2023, సిఎస్ఇ విభాగపు ఉత్కర్ష్- 2023 మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ కె. రామ్మోహన్‌రావు పాల్గొని మాట్లాడారు. తమ మీద తమకున్న నమ్మకం ఆలోచనలలో స్వచ్ఛత లక్ష్య సాధనకు మంచి మార్గాన్ని చూపుతుందన్నారు. విద్యార్థులు జీవితంలో సఫలం చెందాలంటే ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ, ఇతరుల నుంచి నేర్చుకోవటం, మంచి స్నేహితులు కలిగి ఉండడం, పెద్దల మాటలు వినడం, సమయ పాలన, జ్ఞాన సముపార్జన, నిర్మల మనస్సు కలగడం లాంటి పలు లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి వ్యక్తిలోనూ ఏదైనా సాధించే సామర్థ్యం ఉంటుంది, వారి మంచి లక్షణాలతో కృషి చేస్తే సాధించగలరని తెలిపారు. సంస్థ చైర్మన్ పి. మధుసూదన రావు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు ఆత్మ స్థైర్యాన్ని నింపే దిశగా పని చేయాలనీ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి మాట్లుడుతూ విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలను కృషితో అందిపుచ్చుకోవాలని తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమమాలు అలరించగా, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్, ట్రెజర్ హంట్, పేపర్ ప్రెసెంటేషన్, క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గవర్నింగ్ బాడీ మెంబెర్ పివియన్ రాజీవ్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం. రాజన్ బాబు, కళాశాల పూర్వ విద్యార్థి కేశవరామ్, అసోసియేట్ స్టాఫ్ ఇంజనీర్లు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ హరిబాబు, ఎ.వి పరాంకుశం, ప్లేస్‌మెంట్ డీన్ జి. ప్రకాష్ బాబు, పలు విభాగాధిపతులు డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ సతీష్ పూజారి, డాక్టర్ దుర్గా శైలజ, జి. సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావు

రీసర్వేను అడ్డుకుంటే రైతులే నష్టపోతారు

ప్రజాశక్తి - కొత్తవలస

రీసర్వేను అడ్డుకుంటే రైతులే నష్టపోతారని విజయనగరం ఆర్‌డిఒ సూర్యకళ అన్నారు. మండలంలోని చిన్నిపాలెం రెవెన్యూ పరిధిలో, ఏళ్ల తరబడి నెలకొన్న ఈనామ్ భూముల వివాదం నేపథ్యంలో రీ సర్వే జరగనివ్వమంటూ రెవెన్యూ అధికారులకు రైతులు తమ గోడును వినిపించారు. దీంతో మంగళవారం ఆర్‌డిఒ సూర్యకళ చొరవ తీసుకొని ఉత్తరాపల్లి గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో, సాగులో ఉన్న రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, అవగాహనతో సర్వేకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. చిన్నిపాలెం రెవెన్యూలోని సుమారు 11 గ్రామాలకు చెందిన సర్వే నెంబరు ఒకటి నుంచి 174 నెంబర్ల వరకు గల సుమారు 1204 ఎకరాల భూమికి సంబంధించి సుదీర్ఘకాలంగా వివాదం నెలకొంది. జిఎంఆర్ సంస్థ ఇక్కడ పలువురు రైతుల నుంచి 594 ఎకరాల భూమిని కొనుగోలు చేయగా, మిగతా భూమిలో రైతులే సాగులో ఉన్నప్పటికీ రికార్డులు అందుకు భిన్నంగా ఉన్నాయంటూ రైతులు అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. ఆర్‌డిఒ క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించి, రైతులను వారించే ప్రయత్నం చేశారు. రాతపూర్వకంగా ఇస్తారా అంటూ రైతులు ప్రశ్నించడంతో ఈ క్రమంలో ఆమె కొంత అసహనానికి గురయ్యారు. బుధవారం నుంచి రెండు బృందాలతో సర్వే నిర్వహించి సాగులో ఉన్న రైతులను రికార్డుల్లో నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు కాస్త ఊరట చెందారు. ఈ కార్యక్రమంలో అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, గ్రామ పెద్దలు సింగంపల్లి గణేష్, రంగుడు పవన్, మొయ్య దేవుడు, డిప్యూటీ తహశీల్దార్ జెకె అప్పారావు, ఎంఆర్ఐ ఎన్.కిషోర్, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ సూర్యకళ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

'అప్పారి' స్ఫూర్తితో ఉద్యమిద్దాం: యుటిఎఫ్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి స్ఫూర్తితో ఎన్ఇపిని రద్దు చేసేంతవరకు ఉద్యమిద్దామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెవిఆర్‌కె ఈశ్వరరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి ఆశయాలు కొనసాగిస్తామని ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు డి. రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు వి. రధాభవాని, కె.ప్రసాదరావు, పి.వాసుదేవ రావు, ఎన్. సత్యనారాయణ, సిహెచ్ తిరుపతి నాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ శంకరరావు, పి. శ్రీనివాసరావు, జి. రమణ పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉపాధ్యాయ ఉద్యమ పితామహులు, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా బొబ్బిలి యుటిఎఫ్ కార్యాలయంలో మంగళశారం సభ నిర్వహించారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి ఆయన విశేషమైన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేశవరావు, సత్యన్నారాయణ, మధుసూధనరావు, బొబ్బిలి, రామభద్ర పురం, తెర్లాం, మక్కువ మండలాలు నాయకులు రమేష్, శ్రీనివాస్, మహేష్, బత్తుల శ్రీనివాస్, సుధాకర్, శంకరరావు, కృష్ణదాసు మాష్టారు, శారదా రాణి పాల్గొన్నారు.



అప్పారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కాలేజీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సదర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహయకార్యదర్శి డి.రాము మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 24 నుంచి పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో యాజమాన్యాలు పూర్తి ఫీజులు కట్టిన తరువాతే హాల్ టికెట్ ఇస్తామని చెప్పి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నెల 19వ తేదీన పడినటివంటి విద్యా దీవెన ఒక విడత చాలా మంది విద్యార్థులకు రానటువంటి పరిస్థితి అన్నారు. ఒక వైపున ప్రభుత్వం విద్యా దీవెన పడితేనే ఫీజులు కట్టండి ఎవరైనా కాలేజీ యామాన్యాలు విద్యా దీవెన పడకుండా ఫీజులు కట్టండి అని ఒత్తిడి చేస్తే అధికారులకు, ప్రభుత్వానికి తెలియచేయండి వారిపైన చర్యలు తీసుకుంటామని చెప్పినటువంటి ప్రభుత్వం మరో వైపు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజులు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులందరిని ఐక్యం చేసి ఈ ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మెకానిక్ మృతి

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ (36) లారీ ఢీకొని అక్కడకక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గణేష్ ఏసీ మెకానిక్ గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే తన షాపుకి బైకుపై వెళుతుండగా, కొత్తవలస సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొని అక్కడికి అక్కడే మృతి చెందాడు. గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట తరలించారు.



గణేష్ (ఫైల్)

చెరుకు తోట దగ్ధం

బాడంగి : మండలంలోని ముగడ గ్రామంలో చెరుకు పంట దగ్ధమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు అందించిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన తెంటు వాని పొలంలో తీళ్ళ నాగభూషణం, తీళ్ళ మహేష్ అన్నదమ్ములకు చెందిన 6 ఎకరాల్లో చెరుకు, కాలీ బూడిదైంది. సాయంత్రం పంటకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. పంట పూర్తిగా కాలిపోయిందని, ప్రభుత్వ సాయం అందించాలని బాధిత రైతులు కోరారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. పంట పూర్తిగా కాలిపోయిన తరువాత ఫైర్ సిబ్బంది వచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

పేకాట శిబిరం పై దాడి

వేపాడ : మండలంలోని బొద్దాంలో జరగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నామని వల్లంపూడి ఎస్ఐ రాజేశ్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.17,800 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు

ఘనంగా ఉగాది సంబరాలు

శృంగవరపుకోట : ఉగాది సందర్భంగా మండలంలోని మైత్రి విద్యానికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ జి. ఎల్లారావు ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన ముగ్గురికి బహుమతులను అందజేశారు. వారితో పాటు మరో పదిమందికి కన్సలేషన్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణీతగా కే. బాబురావు మాస్టారు వ్యవహరించగా కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక శ్రీ ఆదిత్య విద్యాలయంలో చిన్న మాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా భారతీయ సాంప్రదాయ సంస్కృతి సంబంధించి పాటలు, నాటికలు విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం ఉగాది సంబరాలు సందర్భంగా డిబేట్, వ్యాసరచన చిత్రలేఖన, పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సూరిబాబు, హెచ్ఎం అమృత తదితరులు పాల్గొన్నారు.

'ఫోర్ట్ సిటీ'లో ఘనంగా జల దినోత్సవం

విజయనగరం టౌన్ : ఫోర్ట్ సిటీ స్కూల్లో మంగళవారం జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నీటి పొదుపుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు మాట్లాడుతూ జలాన్ని సరక్షించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్‌చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ గిరిజారాణి, అకాడమిక్ అడ్వైజర్ ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.



తెలగ కులస్తులను బిసిలో చేర్చాలని సభలో కోరుతున్న జిల్లా అధ్యక్షులు చనమలు ప్రసాద్‌రావు

అడవులతోనే రక్షణ

విజయనగరం : అడవులతోనే మానవాళికి రక్షణ లభిస్తుందని అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ జిల్లా -102 గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మంగళవారం అయ్యన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యాన నిర్వహించారు. సత్యం మాట్లాడుతూ ప్రపంచంలో జీవకోటికి ఆశ్రయమిచ్చేది అడవులని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, సహా కార్యదర్శి కందివలస సురేష్, జాళీ వాకర్ పత్రి సాయి పాల్గొన్నారు.

మా వంతు సహకారం

విజయనగరం టౌన్ : సమాజ హితం కోసం పాటుపడే ఏ సంస్థకైనా తమ వంతు సహకారం ఉంటుందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని బ్యాంకు కాలనీ ప్రజా గ్రంథాలయ ఆవరణలో కళింగ ఆర్యవైశ్య కార్పొరేషన్, పట్టణ కళింగ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు, స్టీల్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ సంఘం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కళింగ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ఎ.సూరిబాబు, పట్టణ కళింగ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడ్ల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.